## క్లుప్తంగా

### అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

**విశాఖ విద్య:** జీవీఎంసీ 52వ వార్డులోని గ్రీన్ బెల్ట్‌లు, వాకింగ్ ట్రాకుల్లో గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అధికారులతో కలసి పర్యటించారు. మర్రిపాలెం ఉడాలే అవుట్ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ సమీపంలోని గ్రీన్ బెల్ట్, జిందాల్ సమీపంలోని లలితా డిలైట్ గ్రీన్ బెల్ట్ , వనితా వాకింగ్ ట్రాక్ , పాస్ పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్‌లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించారు. అనంతరం కరాస హిందూ-ముస్లిం-క్రైస్తవ శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్తగా మంజూరైన పనులపై అధికారులతో సమీక్షించారు. ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, సుందరీకరణ విభాగాల అధికారులను అభివృద్ధి పనులను వేగవంతం చేయలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఉష, ఎలక్ట్రికల్ ఏఈ అర్చన, హార్టికల్చర్ ఏఈ పల్లవి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### పాలిమర్స్ పరిహారం అందని వారి వివరాలు తేల్చండి

- 200 మంది ఫిర్యాదుతో స్పందించిన యంత్రాంగం

**మహారాణిపేట:** ఎల్జీ పాలిమర్స్ నుంచి తమకు నష్టపరిహారం అందలేదని సుమారు 200 మంది బాధితులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దరఖాస్తులు చేశారు. దీనిపై అధికారులు స్పందించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ యంత్రాంగం గతంలో ఎల్జీ పాలిమర్స్‌లో ఎంత మందికి నష్టపరిహారం ఇచ్చారు.. ఇంకా ఎంత మంది ఉన్నారో తెలియజేయాలని జీవీఎంసీ యూసీడీ పీడీకి లేఖ రాశారు.

### రెండో రోజు కొనసాగిన 'సాగర్ కవచ్'




సింహాచలం రైల్వే స్టేషన్ మెయిన్ గేటు వద్ద పట్టుకున్న ఆర్‌డీఎక్స్ పేలుడు పదార్థం

**గోపాలపట్నం:** రైల్వే పోలీసులు సింహాచలం రైల్వే స్టేషన్‌లో సాగర్ కవచ్‌లో భాగంగా రెండు రోజు గురువారం కూడా తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సింహాచలం రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద అనుమానిత వ్యక్తి సంచరిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకు తనిఖీలు చేపట్టారు. ఆ వ్యక్తి వద్ద ఉన్న అట్ట బాక్స్‌లో ఆర్‌డీఎక్స్ పేలుడు పదార్థాన్ని గుర్తించారు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ పీకే రాహుల్ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్‌లో విద్రోహ శక్తులు ప్రవేశించకుండా ఎలా గుర్తించాలో అవగాహన కల్పించడానికి ఈ డ్రిల్ నిర్వహించినట్టు తెలిపారు.

### చురుగ్గా పార్కు అభివృద్ధి పనులు



కొత్తగా ఏర్పాటు చేసిన పార్కు ముఖద్వారం

**మల్కాపురం:** జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని వాకింగ్ పార్కులో పలు వసతులు కల్పించారు.పారిశ్రామిక ప్రాంత పరిధి ఏడు వార్డుల ప్రజలు ఉదయం,సాయంత్రం వచ్చి వాకింగ్ చేస్తుంటారు. అయితే పార్కులో వసతులు లేకపోవడంతో స్పందించిన అధికారులు సుమారు రూ.16 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. పార్కులో ఓ భాగం రక్షణ గోడ ఎత్తు ,వాకింగ్ ట్రాక్‌కు మెరుగులు, స్త్రీల కోసం మరుగుదొడ్డి ఏర్పాటు, పార్కు చుట్టూ రంగులు వేశారు. పనులు చివరి దశకు చేరాయి.

# ఆకతాయిల హల్‌చల్





- ద్విచక్ర వాహనాలకు నిప్పు
- పెట్రోలు, బ్యాటరీల దొంగతనాలు
- వీధుల్లో మద్యం బాటిళ్లతో విధ్వంసం
- వీధుల్లో [illegible] బాటిళ్లతో స్థానికుల మొర విధ్వంసం

కంచరపాలెం నుంచి ఊర్వశికూడలి వరకు ఆకతాయిల బెడద పెరిగింది. మత్తుకు అలవాలు పడిన కొంత మంది యువత వీధుల్లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్, బ్యాటరీలు చోరీ చేయడంతో పాటు చిన్న చిన్న పార్ట్‌లు అపహరించి వాటిని స్క్రాప్ దుకాణాలకు విక్రయిస్తున్నారు. అంతటితో ఆగకుండా పాఠశాల విద్యార్థినులు, మహిళలు రాత్రి వేళ ఒంటరిగా వెళితే వెకిలిగా ప్రవర్తిస్తున్నారు. గంజాకు అలవాటు పడిన వారు ఫన్ కోసం, మత్తులో మరికొంత మంది ద్విచక్ర వాహనాలను తగలబెడుతున్నారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

–కంచరపాలెం

జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం కూడలి నుంచి ఊర్వశికూడలి పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. గొల్లకంచరపాలెం, తోటవీధి, చెవిటిరాములవీధి, దుర్గానగర్, వల్లివీధి, గోకుల్‌నగర్, గౌరీనగర్ తదితర కాలనీల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు పార్కింగ్ చేస్తుంటారు. రాత్రి సమయాల్లో పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్, డీజిల్, బ్యాటరీలు దొంగతనాలు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల టైర్లు, వీల్‌కు ఉన్న ప్లేట్లు దొంగలిస్తున్నారు. ద్విచక్ర వాహనాల పెట్రోల్ పైపులను కత్తిరించి మరీ వాటర్ బాటిళ్లు పెట్టి అటుగా రాకపోకలు చేసి బాటిల్ నిండిన తర్వాత వారి ద్విచక్ర వాహనాల్లో వేసుకుని విలాసాలు చేస్తున్నారు. పెట్రోలు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పలు ప్రాంతాల్లో సీసీ కెమరాల్లో కనిపించడంతో మరింత భయపడుతున్నారు. జల్సాలకు అలవాటు పడిన యువత ఏ సంఘటనకైనా పూనుకుంటున్నారని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



తోటవీధిలో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని తగలబెట్టిన దృశ్యం



దుర్గానగర్‌లో ఆకతాయిలు పగుల కొట్టిన ఇంటి ముందు పూలకుండీలు

#### మహిళలకు వేధింపులు

తోటవీధి, దుర్గానగర్ రైల్వేట్రాక్‌కు వెళ్లే ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ఆటోల్లో మద్యపానం, ధూమపానం చేస్తూ అటుగా వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటవీధి ప్రాంతంలో ఇటీవల ద్విచక్ర వాహనాలకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీనిపై స్థానికులు, బాధితులు కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

#### భయం.. భయం

ఆకతాయిలు సందుల్లో తిష్ట వేయడంతో సాయంత్రం పూట తమ పిల్లలు ట్యూషన్లు, బయటకు వెళ్లి వచ్చేంత వరకు భయాందోళనగా ఉంటుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే యువత స్థానిక యువకులతో కలిసి ఇలాంటి పనులు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి వీధుల్లో గస్తీ పెంచాలని, యువత వాహనాలను తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గొల్లకంచరపాలెం పార్కింగ్ చేసిన వాహనాలు

#### ఇక్కడ మందు బాబుల ఆగడాలు



తోటవీధి, దుర్గానగర్ రైల్వేట్రాక్‌కు వెళ్లే ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ఆటోల్లో మద్యపానం, ధూమపానం చేస్తూ అటుగా వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటవీధి ప్రాంతంలో ఇటీవల ద్విచక్ర వాహనాలకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీనిపై స్థానికులు, బాధితులు కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

– నిర్మల, తోటవీధి, కంచరపాలెం

#### అధికారులు స్పందించాలి



రాత్రి పూట ఆకతాయిల బెడద పెరిగింది. ఓ వైపు దొంగతనాలతో ఆందోళన చెందుతున్నాం.. దీనికి తోడు ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టి భయాందోళనకు గురుచేస్తున్నారు. యువత పెడ మార్గానికి అలవాటు పెట్రోల్, డీజిల్ దొంగతనాలు ఒక వ్యసనంగా పెట్టుకున్నారు. ఎవరైనా అడిగితే తిరగబడుతున్నారు. పోలీసు గస్తీని మరింత పెంచాలి.

– లగిశెట్టి నర్సింగారవు, దుర్గానగర్, ఊర్వశికూడలి,

## దార్శనికులు అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్



నరవలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**గోపాలపట్నం:** సమాజంలో అన్ని వర్గాలకు రాజ్యాంగం ద్వారా సమాన అవకాశాలు అందేలా చర్యలు తీసుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ దార్శనికులని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను అమర్‌నాథ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత జాతి ఉన్నతికి, సమాన అవకాశాల కల్పనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాటుపడ్డారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ సేవా సంఘం అధ్యక్షుడు వంగలపూడి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గంరెడ్డి కనకమహాలక్ష్మి నాయుడు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దొడ్డి కిరణ్, నాయకులు గండి రవి, దాడి నూక రాజు, ములకలపల్లి అప్పారావు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## డంపర్ బిన్‌తో దుర్గంధం

- పాఠశాల ప్రధాన గేటు దుర్గంధభరితం
- రోగాల బారిన విద్యార్థులు
- కనీసం స్పందించని ఉపాధ్యాయులు..

**కంచరపాలెం:** రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం, ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలు, కంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రం ప్రధాన గేటు వద్ద జీవీఎంసీ పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన డంపర్ బిన్ ఏర్పాటు చేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. ప్రధాన గేటు ద్వారా కంచరపాలెం, ఆర్పీపేట ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రం, రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ గేటునే వినియోగిస్తుంటారు. గేటుకు ఇరువైపులా చిల్లర దుకాణాలు ఉండడంతో విద్యార్థులు అక్కడ మిఠాయిలు కొనుగోలు చేస్తుంటారు. డంపర్ బిన్‌లో చెత్తాచెదారం నిండి రోడ్లపై పడడంతో పశువుల సంచారం ఎక్కువగా ఉంటుంది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. డంపర్ బిన్ తొలగించమని శానిటరీ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని స్థానిక వ్యాపారులు ఆరోపించారు. విద్యార్థులు సీజనల్ రోగాల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రధాన గేటు ప్రహరీ పక్కన పెట్టడంతో పాఠశాలకు డుమ్మా కొట్టే విద్యార్థులు బాత్‌రూమ్ స్లాబ్‌పై నుంచి ప్రహరీ ఎక్కి డంపర్ బిన్‌పై దూకుతున్నారని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించి డంపర్ బిన్‌ను పాఠశాలకు దూరంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఆర్పీపేట ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం వద్ద అడ్డంగా ఏర్పాటు చేసిన డంపర్ బిన్

## కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెను విరమించుకోండి

**ఉక్కునగరం:** కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెను విరమించుకోవాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులను కోరింది. ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో గురువారం యాజమాన్యం నుంచి హెచ్ఆర్ ఉన్నతాధికారులు ఎం. మధుసూదనరావు, ఎన్. భాను కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ తొలగించిన 1500 మందిని మూడు నెలల్లోగా తీసుకుంటామని హామీ ఇస్తే సమ్మె ఉపసంహరించుకుంటామని తెలిపారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ప్లాంట్ , ఉత్పాదకతలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను ఉపసంహరించుకోవాలని కోరారు.

## చలపతిరావుకు ఘన సత్కారం

**మల్కాపురం:** ప్రముఖ చిత్రకారుడు, రచయిత, కవి, సీనియర్ జర్నలిస్టు సుంకర చలపతిరావుకు ఈ ఏడాది ఉగాదికి రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక బీజేపీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. 59వ వార్డు హిమచల్ నగర్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో బీజేపీ పశ్చిమ నాయకులు పోలిమేర శ్రీను, బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు విజయబాబు, ములగాడ మండల పార్టీ అధ్యక్షుడు లక్కరాజు రామకృష్ణ, కవులూరు గురుమూర్తి, పెద్దిరెడ్ల నానాజీ తదితరులు ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

## వ్యర్థాల తొలగింపు

**సింధియా :** కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో సమీప రేకుల షెడ్లలో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన 40వ వార్డు బీజేపీ అధ్యక్షురాలు మేఘనదుర్గ సమస్యను జిల్లా అధ్యక్షుడు పరశురాము, మేడపాటి రవీంద్ర దృష్టికి తీసుకురాగా.. జీవీఎంసీ పారిశుధ్య అధికారులతో మాట్లాడి గురువారం వ్యర్థాలను తొలగించారు.

## జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు కొనసాగించాలి

**అగనంపూడి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెను మార్పులు తీసుకువస్తామని ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను రద్దు చేయడానికి ఉపక్రమించడం అన్యాయమని అనకాపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిలికి వెంకటరావు, కె.ఎం.నాయుడు అన్నారు.లంకెలపాలెం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గురువారం వారు మాట్లాడారు. కరోనా తరువాత విద్యార్థుల మానసిక స్థితిలో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ఈ పరిస్థితుల్లో విద్యార్థుల మానసిక స్థితి గతుల్లో మార్పులు తీసుకురావడానికి వ్యాయామ విద్య అవసరం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 ఫిజికల్ డైరెక్టర్ ఖాళీలను వేరే సబ్జెక్టులకు మార్పు చేస్తూ నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు.

## ర్యాపిడో డ్రైవర్‌ను బెదిరించి దోపిడీ

**ఉక్కునగరం:** ర్యాపిడో డ్రైవర్‌ను నిలువు దోపిడీ చేసిన సంఘటన బుధవారం రాత్రి స్టీల్‌ప్లాంట్ ప్రాంతంలో జరిగింది. గాజువాక క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా... రాజీవ్‌నగర్‌కు చెందిన టి. కిశోర్ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. పార్ట్‌టైంగా ర్యాపిడో బైకర్‌గా వెళ్తున్నాడు. బుధవారం రాత్రి ర్యాపిడో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా శ్రీనగర్ బంక్ వద్ద ఒక మైనర్ స్టీల్‌ప్లాంట్‌లో దింపితే డబ్బు లిస్తానని తెలిపాడు. దీంతో కిశోర్ మైనర్‌ను బండిపై ఎక్కించుకుని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ రోడ్‌లో వెళ్తున్నాడు. పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్మశానవాటిక వద్ద బైక్ ఆపాలని మైనర్ కోరాడు. కిశోర్ బండి ఆపడంతో మైనర్ బండి దిగి తాళాలు లాక్కుని డబ్బులివ్వాలని డిమాండ్ చేశాడు. దీనికి కిశోర్ నిరాకరించడంతో మొహంపై పిడిగుద్దులు గుద్ది జేబులో ఉన్న ఫోన్ లాక్కున్నాడు. డబ్బులు లేవని చెప్పడంతో ఫోన్ లాక్ తీయించి ముగ్గురు వ్యక్తులకు రూ. 45 వేలు, రూ. 2500, రూ. 600 ట్రాన్స్‌ఫర్ చేయించిన తర్వాత మైనర్ అక్కడ నుంచి పరారయ్యాడు. కిశోర్ తన సోదరుడి సాయంతో పోలీసులను ఆశ్రయించాడు. గాజువాక క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు రంగంలో దిగి సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా ఆ మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతను ఫోన్‌పే చేసిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని నగదు రికవరీ చేశారు.

## ప్రయాణం..నరకప్రాయం

- పిక్క తేలి,బురద మయంగా మారిన సేవా మార్గం
- చిన్నపాటి వర్షానికే చెరువుగా మారుతున్న వైనం



బురదతో వాహనదారుల అవస్థలు



గుంతల రోడ్డుపై ప్రమాదకరంగా ప్రయాణం

**మల్కాపురం:** ఆ మార్గంలో ప్రయాణం అంటే వాహనదారుల గుండెల్లో గుబులు పుట్టుకుంటుంది. దేవుడా ఎన్నళ్ళు ఈ కష్టాలు అంటూ తమ తమ ప్రయాణాలు సాగిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆ మార్గం చెరువును తలపించే విధంగా మారుతుంది. 58వ వార్డు చివరి ప్రాంతమైన ములగాడ విలేజ్ నుంచి శ్రావణి షిప్పింగ్ సంస్థ మీదుగా మారుతి సర్కిల్ వైపు వెళ్లే మార్గం పూర్తిగా గుంతల మయంగా మారింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈ మార్గంలో గల గుంతలలో వర్షపు నీరు చేరి చెరువు మాదిరిగా మారింది. దీనికి తోడు రహదారి అంతా బురద మయంగా ఉండటంతో ఆ మార్గాన రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డాక్‌యార్డ్ వంతెనపై రాకపోకలు నిలిపివేయడంతో పలువురు వాహనదారులకు ఈ కష్టాలు తప్పడం లేదు. పారిశ్రామిక ప్రాంతంలో భారీ పరిశ్రమలైన డాక్‌యార్డ్, ఎస్‌బీసీ, ఎస్ఆర్, షిప్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ వంటి పరిశ్రమలలో ఆయా పరిశ్రమలకు దగ్గరలో నివాసాలు ఉన్న వారే కాకుండా నగర పరిధిలోని పలు ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో పర్మినెంట్ ఉద్యోగులతో పాటు, కాంట్రాక్ట్ కార్మికులు డాక్‌యార్డ్‌కు సమీపాన గల సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మార్గం ద్వారా రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం మరమ్మతులు చేస్తుండడంతో 9 నెలల నుంచి వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు తదితరులు ములగాడ మీదుగా రాకపోకలను సాగిస్తున్నారు. కొంత మంది డాక్‌యార్డ్‌కు ఎదురుగా గల వీడీఆర్ గోడౌన్స్, హెచ్‌పీ ఎల్‌పీజీ టెర్మినల్ మీదుగా మారుతి సర్కిల్‌పై గల బ్రిడ్జి మీదుగా వాహనాల రాకపోకలను సాగిస్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు ఇతరులు ద్విచక్ర వాహనాలపై ఎక్కువగా రాకపోకలు సాగించడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య, పెద్ద ఎత్తున కాలుష్య సమస్య ఇక్కడ తలెత్తుతున్నాయి. వాహనదారులతో పాటు ములగాడ, ఎదురవానిపాలెం, చిన్న ములగాడ, గొందేశివానిపాలెం ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారు వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ద్వారా పోర్టు అధికారులకు సమస్యను వినతి రూపంలో వివరించారు. అయిన నేటికీ దీనిపై ఎలాంటి స్పందన లేదు.